RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

కరీంనగర్ సోమవారం 06.04.2026 సంపుటి:03 సంచిక:121 పేజీలు:08 వెల : 05
Karimnagar Monday 06.04.2026 Volume : 03 Issue : 121 Pages : 08 Cost : 05

తెలుగు దినపత్రిక







# ఆ దారిలో వెళ్లకపోతే భవిష్యత్తు ప్రమాదకరం కావడం ఖాయం

# సీఎం రేవంత్‌రెడ్డి

**జనోదయ హైదరాబాద్, ఏప్రిల్ 05:**

దేశంలోని యువత క్రీడా మైదానాలను ఎందుకు వదిలేసిందన్న అంశంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. యువతను సరైన మార్గంలో పెట్టకపోతే దేశం ప్రమాదకర పరిస్థితులకు నెట్టివేయబడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 74వ బోలానాథ్ ముల్లిక్ స్మారక ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ 2026 ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన పోలీసు క్రీడాకారులను ఉద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. "యువత నెమ్మదిగా క్రీడలకు దూరమవుతున్నారు. క్రీడా మైదానాలను వదిలిపెట్టి యువత తప్పు చేస్తున్నారు. దేశం కోసం ఏమైనా చేయడానికి మనందరం సిద్ధంగా ఉండాలి. యువత సరైన దశలో వెళ్లకపోతే భవిష్యత్తు ప్రమాదకరంగా మారుతుంది అని హెచ్చరించారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సిద్ధంగా ఉంది. క్రీడాకారులను తయారు చేసి దేశ ప్రతిష్టను నిలబెట్టాలి. యువతను క్రీడల్లో ప్రోత్సహించండి అని పిలుపునిచ్చారు.

### కొన్నేళ్లుగా పట్టించుకోలేదు...

భారత్ ఫుట్‌బాల్ చరిత్రలో హైదరాబాద్ నగరానికి విశేష పేరు ప్రఖ్యాతులున్నాయి. 195060 దశకంలో నర్సరీ ఆఫ్ ఇండియన్ ఫుట్‌బాల్‌గా హైదరాబాద్ పేరు గడించింది. దేశంలోనే ఫుట్‌బాల్‌ను అంతగా ఆదరించింది. 1956 ఒలంపిక్స్‌లో ఆడిన ఫుట్‌బాల్ జట్టులో ఏడుగురు క్రీడాకారులు హైదరాబాద్‌కు చెందిన వారే. ఆ క్రమంలో ఆల్ ఇండియా పోలీస్ ఫుట్‌బాల్ చాంపియన్ షిప్ హైదరాబాద్‌లో నిర్వహించడం గర్వంగా ఉంది. ఈ క్రీడల నిర్వహణ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తెచ్చిన పోలీసు విభాగానికి మనస్ఫూర్తిగా అభినందనలు. దేశం నలుమూలల నుంచి ఈ క్రీడల్లో పాల్గొని అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శించిన టీమ్‌లకు తెలంగాణ ముఖ్యమంత్రిగా అందరికీ అభినందనలు. 140 కోట్ల జనాభా కలిగిన భారత్ ఒలింపిక్స్‌లో కనీసం ఒక్క గోల్డ్ మెడల్ కూడా సాధించలేకపోవడం గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. గతంలో ఇదే గచ్చిబౌలీలో ఎన్నో క్రీడలు నిర్వహించాం. గడిచిన కొన్నేళ్లుగా పట్టించుకోలేదు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో మనవాళ్లు ఓడిపోగానే కొద్దిరోజులు చర్చించి ఆ తర్వాత విస్మరిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాల వలలో పడి నిర్వీర్యమైపోతోంది. వీరుల భూమి, ఎంతోమంది త్యాగధనులకు కేంద్రమైన పంజాబ్‌లో ఈరోజు మాదకద్రవ్యాల గురించి వినిపిస్తోంది.

### ప్రభుత్వం సిద్ధం..

అందుకే ఆలోచించి తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. ఎంతో మంది నిష్ణాతులతో కలిసి రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పాం. క్రీడల్లో రాణించిన వారికి అన్ని విధాలుగా ప్రోత్సహించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాలతో సమాజంలో సరికొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. పోలీసు విభాగాలకు చెందిన క్రీడాకారులు మైదానాల్లో ఎలాగైతే ప్రతిభను, స్ఫూర్తిని కనబరిచారో సైబర్ క్రైమ్, మాదక ద్రవ్యాల నియంత్రణలో కూడా ప్రతిభను కనబరచాలి.. అని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ 5 వరకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ చాంపియన్ షిప్, ముగింపు కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, డీజీపీ శివధర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అకాడమీ చైర్మన్ శివసేనా రెడ్డి, సీఐడీ డీజీ శిఖా గోయల్, ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్, ఇంటెలిజెన్స్ బ్యూరో స్పెషల్ డైరెక్టర్ స్వప్న తివారి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్, సైబరాబాద్ సీపీ రమేష్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా మైదానంలో మ్యాచ్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన టీమ్‌లకు ట్రోఫీలను అందించారు.



# దేశంలోనే సక్సెస్‌ఫుల్ స్టార్టప్ స్టేట్ తెలంగాణ

# కే.టి.ఆర్




**జనోదయ హైదరాబాద్, ఏప్రిల్ 05:**

స్వతంత్ర భారతదేశంలో అత్యంత విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అమెరికా న్యూయార్క్ నగరంలోని ప్రతిష్టాత్మక కొలంబియా బిజినెస్ స్కూల్‌లో నిర్వహించిన 21వ వార్షిక ఇండియా బిజినెస్ కాన్ఫరెన్స్‌కు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఉద్దేశించి తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని వివరించారు. కేసీఆర్ నాయకత్వంలో పరిపాలన, ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిలో దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రస్థానం అంటే ఆత్మగౌరవం, ఆకాంక్ష, పురోగతికి నిదర్శనమన్నారు. తాము అవకాశాల కోసం ఎదురుచూడలేదని.. వాటిని అందిపుచ్చుకునేందుకు అద్భుతమైన పాలసీలను తయారు చేశామని తెలిపారు. తద్వారా పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించి వృద్ధిని సాధించామని పేర్కొన్నారు. 2027లో భారత్ 80వ స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమవుతున్న వేళ, కేవలం పదేళ్లలోనే తెలంగాణ సాధించిన ఆర్థిక ప్రగతి గర్వకారణమని అన్నారు.రాష్ట్రాలే దేశాభివృద్ధికి ఇంజన్లు అన్న ప్రాథమిక విషయాన్ని కేంద్రం గుర్తించాలన్నారు. భారత దేశం 28 ఇంజిన్లు కలిగిన ఒక ఫార్ములా 1 రేసింగ్ కార్ లాంటిదన్నారు. 2014 నుండి 2023 మధ్య కాలంలో తెలంగాణ సాంకేతిక రంగం సాధించిన గణాంకాలను కేటీఆర్ వివరించారు. ఐటీ ఎగుమతులు రూ.57వేల కోట్ల నుండి రూ.2.72 లక్షల కోట్లకు పెరిగాయని.. ఐటీ ఉద్యోగాల సంఖ్య 3.23 లక్షల నుండి దాదాపు 10 లక్షలకు చేరుకున్నదని తెలిపారు. ప్రభుత్వ వేగవంతమైన నిర్ణయాలు, పటిష్టమైన ఎకో సిస్టమ్ కారణంగానే హైదరాబాద్ గ్లోబల్ ఐటీ దిగ్గజాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పారు. హైదరాబాద్‌లో అమెజాన్ ప్రపంచంలోనే అతిపెద్ద క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందని, గూగుల్, ఆపిల్, మెటా, సేల్స్ ఫోర్స్, ఉబర్, మైక్రాన్ టెక్నాలజీ వంటి సంస్థలు తమ కీలక కార్యకలాపాలను ఇక్కడ నిర్వహిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు చిరునామా తెలంగాణ మారిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీ పర్పస్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అయిన 'కాళేశ్వరం' ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతోందని వివరించారు.




# క్షమాపణలు చెప్పినా.. ఆయన్ను వదిలిపెట్టం

## రాహుల్ గాంధీ

**జనోదయ డిల్లీ, ఏప్రిల్ 05:**

అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ క్షమాపణలు కోరినా.. ఆయన్ను వదిలిపెట్టబోమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అస్సాంలోని బిశ్వనాథ్ చరియాలీలో నిర్వహించిన ప్రచార సభలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. హిమంతను దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన ముఖ్యమంత్రిగా అభివర్ణించారు. ‘‘అస్సాంకు చెందిన దివంగత గాయకుడు జుబిన్ గార్గ్.. రాష్ట్ర ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు తన జీవితాంతం కృషి చేశారు. ఆయన ఎవరితోనూ దురుసుగా ప్రవర్తించలేదు. మా పార్టీ భావజాలం కూడా అలాంటిదే. ద్వేషానికి వ్యతిరేకంగా ప్రేమను పంచడమే మా సిద్ధాంతం. మేం అధికారంలోకి వస్తే.. జుబిన్ మృతి కేసులో నిందితులను 100 రోజుల్లోగా శిక్షిస్తాం’’ అని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆరు సామాజిక వర్గాలకు ఎస్టీ హోదా ఇస్తామని, తేయాకు కూలీలకు రోజుకు రూ.450 చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హిమంత నేతృత్వంలోని భాజపా సర్కారు ప్రజల్లో విద్వేషాన్ని వ్యాప్తి చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. హిమంత అవినీతి చిట్టా ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా వద్ద ఉందన్నారు. ఇక్కడి ప్రభుత్వాన్ని దిల్లీ నుంచి నియంత్రిస్తున్నారని, రాష్ట్రాన్ని భాజపా ఏటీఎంలా మార్చేశారని విమర్శించారు. మరికొన్ని రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటవుతుందని, అప్పుడు హిమంత క్షమాపణలు కోరినా.. ఆయనపై చర్యలు తప్పవని చెప్పారు.



# జడ్జీలకే రక్షణ కల్పించలేకపోయారు

## బెంగాల్ ప్రభుత్వంపై ప్రధాని మోదీ ఫైర్

**జనోదయ హైదరాబాద్, ఏప్రిల్ 05:**

పశ్చిమ బెంగాల్‌లో ఇటీవల న్యాయాధికారులను ఘెరావ్ చేసిన ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అధికార తృణమూల్ కాంగ్రెస్‌పై మండిపడిన ఆయన.. ప్రభుత్వం ‘మహా జంగల్‌రాజ్’గా మారిందన్నారు. కూచ్ బెహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన.. రాష్ట్రంలో శాంతిభద్రతలు గాడితప్పాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం జడ్జీలకే రక్షణ కల్పించలేకపోయిందని.. ఇక సాధారణ ప్రజలకు ఏం రక్షణ కల్పిస్తుందని విమర్శించారు. ‘‘మాల్దాలో జరిగిన ఘటన తృణమూల్ కాంగ్రెస్ మహా జంగల్ రాజ్‌ను ప్రతిబింబిస్తోంది. ఏ రాజ్యాంగ వ్యవస్థ ప్రాముఖ్యతను టీఎంసీ ప్రభుత్వం గుర్తించదు. ఈ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం దాడికి గురవుతోంది. ఇక్కడ పరిస్థితి ఎలా ఉందంటే.. చివరకు సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని ఈ రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది’’ అని ప్రధాని మోదీ దుయ్యబట్టారు. ఇలాంటి ప్రజలకు రక్షణ కల్పిస్తుందని ప్రభుత్వం బెంగాల్ నుంచి ఆశించలేమన్నారు. మాల్దాలో ఇటీవల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR)లో పాల్గొన్న



ఏడుగురు జడ్జీలను.. జాబితాలో పేర్లు గల్లంతైన కొందరు స్థానికులు ఘెరావ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ఎంఐఎం పార్టీకి చెందిన ఒక వ్యక్తిని బెంగాల్ పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు ఇదే ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ కూడా విచారణ చేపడుతోంది.

# క్యాన్సర్ బాధితుడికి వాకర్స్ అసోసియేషన్ సభ్యుల చేయూత - 15 వేల ఆర్థిక సహాయం

**జనోదయ గంగాధర ఏప్రిల్ 05:**
గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గీకురు అంజయ్య గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో తీవ్రంగా బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ పరిస్థితి బలహీనంగా ఉండటంతో వైద్య ఖర్చులు భరించడం వారికి కష్టంగా మారింది. ఈ విషయం తెలుసుకున్న ఆదిపెల్లి పృథ్వీధర్ గౌడ్ గారు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి మధురానగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు ఈ విషయాన్ని తెలియజేశారు.
విషయం తెలుసుకున్న వెంటనే మధురానగర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు స్పందించి తమ వంతు సహాయంగా రూ. 15,000 ఆర్థిక సహాయాన్ని సేకరించి బాధితుడు గీకురు అంజయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది చేయాలని వారు సూచించారు.



## 4వ వార్డులో రెనె హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన




**మంథని ఏప్రిల్ 05, (జనోదయ):**
మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి ప్రాంతంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు 4వ వార్డు కౌన్సిలర్ ఎరుకల స్రవంతి రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. రెనె హాస్పిటల్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 80 మంది ప్రజలు వైద్య సేవలను పొందారు. బీపీ, షుగర్ వంటి ప్రాథమిక పరీక్షలు నిర్వహించడంతో పాటు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ శ్రీను,ఇంచార్జి ఆర్ల శేఖర్, శ్యామ్,సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**




**జనోదయ, మంథని ఏప్రిల్ 05:**
పెద్దపల్లిలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. బస్టాండ్ సమీపంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. అంటరానితనం నుంచి ఉప ప్రధాని స్థాయికి ఎదిగిన జగ్జీవన్ రామ్ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ ఆయన దేశానికి విశేష సేవలందించిన మహానుభావుడని కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదల పెన్నిధి చెన్నూర్ లయన్స్ క్లబ్

**జనోదయ (చెన్నూరు ఆర్ సి), ఏప్రిల్ -05:**
దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి మనందరికీ ఈ రోజు చెన్నూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ చేసుకుని తిరిగి చెన్నూర్ కి వచ్చిన వారికి పండ్ల పంపిణీ నిరుపేదలకు కంటిచూపులు ప్రసాదిస్తున్న చెన్నూరు లయన్స్ క్లబ్ డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార నేత్ర వైద్యశాల రేకుర్తి కరీంనగర్ వారి సౌజన్యంతో వైస్ చైర్మన్ చిదుర సురేష్ సహకారం తో చెన్నూర్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జాడి తిరుపతి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత నేత్ర శిబిరంలో 70మంది హాజరుకాగా,వారికి బీపీ, షుగర్ పరీక్షలు చేయడం జరిగింది., కంటి చూపుతో బాధపడుతున్న అర్హతగల 40 మందిని గుర్తించి వారిని ఉచిత కంటి ఆపరేషన్ కోసం రేకుర్తి కంటి దవాఖానకు తరలించగా 38మందికి శనివారం రోజున ఆపరేషన్ చేయడం జరుగుతుంది. ఈ రోజు కరీంనగర్ నుండి చెన్నూరుకి వచ్చిన వారికి పండ్ల పంపిణీ చేసి తగు జాగ్రత్తలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జాడి తిరుపతి, కార్యదర్శి సౌడం శ్రీనివాస్, కోశాధికారి నిమ్మల సాగర్, కప్ప ప్రతాప్ సింగ్,రావుల మధుకర్, మోర్ల మధుకర్ తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రేవంత్‌రెడ్డిపై పుట్ట మధూకర్ తీవ్ర విమర్శలు

**హామీలు అమలు చేయలేదని ఆరోపణ**

**జనోదయ, మంథని,, ఏప్రిల్ 05:**

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మంథని రాజ గృహాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎంను సొంత పార్టీ కార్యకర్తలే గుర్తించడం లేదని ఎద్దేవా చేశారు. ప్రజల అసంతృప్తి నుంచి దృష్టి మళ్లించేందుకే బీఆర్ఎస్ నేతల కార్యాలయాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు కార్యాలయంపై దాడిని ఖండిస్తూ, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. మంథనిలో దుద్దిళ్ల శ్రీధర్ బాబు నాయకత్వంలోనే సీఎంను అవమానించారని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు, గ్యారెంటీలు అమలు కాలేదని, రైతు సంక్షేమ పథకాలను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. మూసీ నది ప్రక్షాళన పేరుతో పెద్ద మొత్తంలో ఖర్చులు చేస్తామని చెప్పడం కంటే ముందుగా ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కంటే విధ్వంసమే ఎక్కువగా జరుగుతోందని, వ్యాపారాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజలే ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.




## “ఓసిపి-2 మైన్‌లో 600 కోట్ల యంత్రాలు స్క్రాప్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: వైవి రావు డిమాండ్

**ఆర్ జి3 ఏరియాలో ఓసిపి-2 మైన్‌లో యంత్రాల పరిశీలన**

**600 కోట్ల క్రషర్లు, స్ప్రెడర్లు నిర్వీర్యం పై ఏఐటీయూసీ ఆగ్రహం**



**జనోదయ, మంథని,, ఏప్రిల్ 05:**

ఆర్ జి 3 ఏరియాలోని ఓ సి పి2 మైన్‌లో 600 కోట్ల రూపాయలతో కొనుగోలు చేసి ప్రస్తుతం స్క్రాప్‌గా మారిన క్రషర్లు, స్ప్రెడర్లను ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు, సెంట్రల్ సెక్రటరీ జూపాక రామచందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్మనీ టెక్నాలజీతో రూపొందించిన ఈ ప్రాజెక్టును కార్పొరేట్ అధికారులు నిర్వీర్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్రషర్‌స్ప్రెడర్ కాంబినేషన్‌తో నడిచే ఈ ప్రాజెక్టు సంస్థకు కీలకమని, అయినప్పటికీ పలుమార్లు జీఎం, స్ట్రక్చర్ కమిటీల్లో ప్రశ్నించినా పట్టించుకోలేదన్నారు. టక్రాఫ్ సంస్థకు చెందిన యంత్రాలను ఎల్ 1గా ఎంపిక చేసి అమలు చేసిన తీరు సందేహాస్పదమని పేర్కొన్నారు. 3 నిమిషాల్లో 40 టన్నుల బొగ్గును క్రష్ చేసే సామర్థ్యం ఉన్న స్ప్రెడర్‌ను నిలిపివేయడం వల్ల యంత్రాలు నిరుపయోగంగా మారాయని తెలిపారు. ప్రస్తుతం ఆ ప్రదేశం దొంగలకు అడ్డాగా మారిందని, కోట్ల రూపాయల విలువైన సామాగ్రి స్టోర్లలో వృథాగా ఉండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు చేసిన లోపాలపై విజిలెన్స్ విచారణ జరపాల్సిందిపోయి, కార్మికుల వ్యక్తిగత విషయాలపై విచారణ చేయడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుని క్రషర్ 301, స్ప్రెడర్ 701లను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని, ఓ సి పి 2 మైన్‌ను మళ్లీ అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది.

# వీకెండ్ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

## సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల చర్యలు



**జనోదయ శేరిలింగంపల్లి, ఏప్రిల్ 05 :** సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు (సిటిపి) వీకెండ్ సందర్భంగా ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి మొత్తం 205 మంది పట్టుకున్నారు. వాహనాల వారీగా కేసుల వివరాలు ఇలా ఉన్నాయి: రెండు చక్రాల వాహనాలు: 170. మూడు చక్రాల వాహనాలు: 08.నాలుగు చక్రాల వాహనాలు: 27 భారీ వాహనాలు: 00, రక్తంలో ఆల్కహాల్ స్థాయి (బిఏసి) ఆధారంగా నిందితుల విభజన: 190 మందికి 36 మిల్లీగ్రామ్/100 మిల్లీలీటర్లు నుండి 200 మిల్లీగ్రామ్/100 మిల్లీలీటర్లు వరకు 12 మందికి 201 మిల్లీగ్రామ్/100 మిల్లీలీటర్లు నుండి 300 మిల్లీగ్రామ్/100 మిల్లీలీటర్లు వరకు 03 మందికి 301 మిల్లీగ్రామ్/100 మిల్లీలీటర్లు నుండి 550 మిల్లీగ్రామ్/100 మిల్లీలీటర్లు వరకు, అందరు నిందితులను గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తారు. సైబరాబాద్ పోలీసులు హెచ్చరిస్తూ, మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని తెలిపారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమై ప్రాణనష్టం జరిగితే, సంబంధిత వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 (హత్యకు సమానం కాని దోషపూరిత హత్య) కింద కేసులు నమోదు చేస్తారు. ఈ నేరానికి గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు జరిమానా విధించబడుతుంది. గత వారం (2026 మార్చి 30 నుండి 2026 ఏప్రిల్ 04 వరకు): మొత్తం 47 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు న్యాయస్థానాలలో పరిష్కరించబడ్డాయి.వాటిలో: (00) మందికి జరిమానా, జైలు శిక్ష, (01) మందికి జరిమానా, సామాజిక సేవ. (46) మందికి జరిమానా మాత్రమే విధించారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి



**మంథని (జనోదయ) ఏప్రిల్ 05:** దేశ ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయానికి ప్రతీక బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతిని మంథనిలో ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ మాట్లాడుతూ జగ్జీవన్ రామ్ పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగయ్యతో పాటు ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వరంగల్ ముద్దు బిడ్డ హై కోర్టు అడ్వకేట్ నాగేశ్వర్ రావు పూజారి జన్మదిన వేడుకలు

**జనోదయ, హనుమకొండ, ఏప్రిల్ 05:**

మల్లికంబ మనోవికాస కేంద్రం లో అనాథ పిల్లలు, మనోవికాస పిల్లల మధ్య అక్రమ తప్పుడు కేసుల బాధితుల న్యాయ పోరాట సమితి తరుపున జన్మ దిన వేడుకలు జరిపారు సందర్భంగా అధ్యక్షులు బొట్ల మహర్షి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా గర్వించే ముద్దు బిడ్డ హై కోర్టు అడ్వకేట్ నాగేశ్వర్ రావు పూజారి ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన వ్యక్తి భారత దేశం మొత్తం గర్వించ దగ్గ గొప్ప మనిషిగా ఒక హై కోర్టు న్యాయవాది గా పేదలకు సామాన్య ప్రజలకు ఉచితంగా తన గళం ను హై కోర్టులో వాదిస్తున్న ఏకైక న్యాయవాది పూజారి నాగేశ్వర్ రావు.తన జీవితం మొత్తం కోర్టులో అంకితం కావాలి నా మరణం కోర్టు ప్రాంగణం లో జరగాలని కోరిన గొప్ప మహనీయుడు నిస్వార్థం తో పేద వారిని తన హక్కుగా చేర్చు కొని ఎంతో మంది విద్యార్థులను, యువత ను ప్రోత్సహం చేస్తూ విద్యను, కళాకారులను సినిమా రంగంలో శిఖరాలు చేర వేస్తున్నారు అంతే కాకుండా తన లాగా అడ్వకేట్స్ నీ తన సొంత ఖర్చులతో ఉచితంగా చదివిస్తున్నారు..ప్రపంచం లో ఎవరు చేయని విధంగా తన సొంత డబ్బులతో షూరీటిలు కట్టి బెయిల్ మంజూరు అయ్యి కొన్ని సంవత్సరాలు జైలు లో మగ్గి ఉన్న విచారణ ముద్దాయిలను వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి విడుదల చేస్తున్నాడు ..చివరిగా ది ఏజ్ ఆఫ్ 14 టు 25 ప్రొటెక్ట్ యువర్ లైఫ్ అనే పుస్తకాన్ని నిర్మాత గా ఉండి బొట్ల మహర్షి అనే రచయిత తో పుస్తకాని రాయించి తన సొంత ఖర్చులతో వెయ్యిలా పుస్తకాలను ముద్రణ చేసి ఉచితంగా గవర్నమెంట్ స్కూల్స్ లో, కాలేజీలో పంపిణీ చేసి ఆ పుస్తకం ద్వారా అవగాహన కల్పించడం మిషన్ 0% క్రైమ్ గా నేర రహిత సమాజం కోసం కృషి చేస్తూ విద్యార్థులకు, యువతకు పోటీ పరీక్షలు నిర్వహించి విజేతలకు ప్రైజ్ మనీ ఇస్తున్నాడు..అంతే కాకుండా లక్ష మంది విడాకులకు దరఖాస్తులు చేసుకున్న కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి వారు కలిసి కాపురం చేసేటట్టు కృషి చేశాడు వారి పిల్లల భవిష్యతులను కాపాడిన మహనీయుడు ఒక మాటలో చెప్పాలంటే నాగేశ్వర్ రావు పూజారి జీవితం అందరికి ఆదర్శనీయం.భారతదేశ ప్రభుత్వం అతనిని గుర్తించి అతని సేవలను గుర్తించి సత్కరించి ప్రజలకు తెలియపరిచాలి కులం, మతం, ప్రాతం అనే బేధం లేని మానవత వాది ఈ లాంటి గొప్ప అడ్వకేట్ నా జీవితంలో చూడలేదని ఆవేదన వ్యక్తం చేశాడు..ఈ కార్యక్రమంలో కోగిల కిరణ్, ఒంటేరు చక్రి, మామిడ్ల భారత్, పసునూరి అనిల్,ఒగ్గు కిరణ్ తదితరులు పాల్గొన్నారు..అదే విధంగా తన ఆశయాలను కొనసాగించేందుకు పలువురు రక్తదానం చేశారు.





# ఏసుక్రీస్తు పునరుత్థానం మానవాళికి రక్షణ



**వరంగల్ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 5 (జనోదయ):** గ్రేటర్ వరంగల్ నగరంలోని బండి బజార్ సెంటినరీ ట్రినేటీ బాప్టిస్ట్ సంఘం మట్టేవాడ నందు ఆదివారం ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 25వ డివిజన్ పరిధిలోని వరంగల్ నియోజక ప్రజలకు ఏసుక్రీస్తు పునరుత్థానం మానవాళికి రక్షణ, నూతన జీవనానికి ప్రతీకగా నిలిచే ఈస్టర్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులందరికీ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రెవరెండ్ డాక్టర్ బి వినయ్ కుమార్ స్థానిక సంఘ కాపరి మాట్లాడుతూ.. ఈ పవిత్ర దినం అందరి జీవితాల్లో శాంతి, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. సత్యం, కరుణ, నమ్మకం, ఐక్యత వంటి మహోన్నత విలువలను ఆచరించేలా మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు ప్రభువైన యేసుక్రీస్తు పునరుద్ధాన శుభాకాంక్షలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జన్ను శ్యామ్, జన్ను కరుణాకర్, జన్ను సుమ్మియన్, జన్ను అనిల్, క్రైస్తవ సోదర సోదరీమణులు కమిటీ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ చేయడం చట్టవిరుద్ధం రామగుండం సి పి



**జానోదయ చెన్నూరు ఆర్.సి న్యూస్ ఏప్రిల్ 05:** లింగ నిర్ధారణ, లింగ ఎంపికపై కఠిన చర్యలు: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా. గర్భిణీలకు లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టవిరుద్ధమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. పీసీఎన్డీటీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. గర్భంలో ఉన్న శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి చట్టవిరుద్ధ చర్యలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని అన్ని అల్ట్రాసౌండ్ స్కానింగ్ కేంద్రాలు చట్టబద్ధమైన నమోదు ద్వారా మాత్రమే నిర్వహించాలని సూచించారు. మొదటిసారి నేరం చేస్తే మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల వరకు జరిమానా విధిస్తారని తెలిపారు. పునరావృతం అయితే ఐదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు రూ.50 వేల వరకు లేదా అంతకుమించి జరిమానా విధిస్తారని వివరించారు. సంబంధిత వైద్యులు, సిబ్బంది చట్టాన్ని ఉల్లంఘిస్తే వారి వైద్య అనుమతిపత్రాన్ని సస్పెండ్ చేయడం లేదా పూర్తిగా రద్దు చేస్తారని పేర్కొన్నారు.

# బి ఆర్ ఎస్ వి నాయకుల అరెస్ట్..

జనోదయ ఆర్ సి న్యూస్ చెన్నూర్ ఏప్రిల్ 05: ఈరోజు మధ్యాహ్నం సమయంలో చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద BRSV నాయకులు ఎలాంటి ముందస్తు సమాచారం గాని లేదా అనుమతి లేకుండా గూమిగూడి ప్రజా సౌకర్యాలకు ఆటంకం కలిగించి రాష్ట్ర మంత్రి వివేక్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే గాక, నినాదాలు చేస్తూ దిష్టి బొమ్మ దగ్ధం చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకు గాను బడికెల శ్రావణ్, Md. నాయబ్, కొప్పుల రవీందర్, రేణుకుంట్ల శ్రీనివాస్, తుంగపిండి నవీన్, చిలుముల సంపత్, సార్ల శివ మరియు తగరం మహేందర్ ల పై కేసు నమోదు చేసి, ఇట్టి సంఘటనకు కారణమైన సంబంధిత BRSV వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేయనైనది. చట్ట వ్యతిరేకంగా, ప్రజా శాంతికి భంగం కలిగేలా ఎవరైనా ప్రవర్తించిన యెడల లేదా ఉద్దేశ్య పూర్వకంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకొనబడుతాయి.



# కేబుల్ ఆపరేటర్లకు అగ్నిప్రమాద సెగ

## రోడ్డు పక్కన పిచ్చి మొక్కలే శాపం

జానోదయ జైపూర్ ఏప్రిల్ 05: జైపూర్ మండలంలోని పెగడపల్లి ,గంగిపల్లి గ్రామాల మధ్య ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో 500 మీటర్ల ఆప్టికల్ ఫైబర్ కేబుల్ దగ్ధమై సుమారు 5 వేల రూపాయల ఆర్థిక నష్టం వాటిల్లిందని, టీవీ ప్రసారాలు నిలిచిపోవడంతో వినియోగదారుల ఆగ్రహానికి గురవ్వాల్సి వస్తోందని కేబుల్ ఆపరేటర్లు వెంకన్న, ఏ. శ్రీనివాస్, కృష్ణమూర్తి, శేఖర్, ఎస్. శ్రీనివాస్, సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు.రహదారి పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, పేరుకుపోయిన చెత్తాచెదారం వేసవి ఎండలకు ఎండిపోయి ఉండటంతో, ఎవరో చేసిన చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల మంటలు వేగంగా వ్యాపించి విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను దహించి వేశాయని వారు ఆరోపించారు. ఈ పిచ్చి మొక్కలు కేవలం అగ్ని ప్రమాదాలకే కాకుండా, మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకుండా చేస్తూ రహదారి ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని, కావున ప్రయాణికులు, రైతులు అజాగ్రత్తగా నిప్పు అంటించి తమ వ్యాపారానికి అంతరాయం కలిగించవద్దని అదే క్రమంగా వారు విజ్ఞప్తి చేశారు.



# సింగరేణి ఆర్జీ-1లో రెండో విడత ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

జనోదయ, గోదావరిఖని, ఏప్రిల్ 05: సింగరేణి ఆర్జీ1 ఏరియాలో పని చేస్తున్న కార్మికులు తమ ఆరోగ్యాలను కాపాడుకునేందుకు ఆహ్లాదంగా ఉండేందుకు ఆదివారం గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో రెండో విడత క్రికెట్ టోర్నమెంట్ ను గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి రంగు శ్రీను టాస్ వేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సింగరేణి లో పని చేస్తున్న యువ కార్మికులు వారి ఆరోగ్యాలు బాగుండాలనే ఆలోచన తో ఏఐటియుసి జి.ఎం.కమిటి మెంబర్ సిర్ర మల్లికార్జున్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ పేరుతో గత కొన్ని నెలలుగా ఆర్జీ వన్ ఏరియాలో వీకెండ్ లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ లో జిడికె 2వ ఇంక్లైన్, 2ఏ ఇంక్లైన్ జట్లతో పాటు సివిల్ డిపార్ట్మెంట్ జట్లు పాల్గొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్ కు సహకరించిన ఆర్జీ1 జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ కు మరియు ఇతర అధికారులకు, యూనియన్ నాయకులకు, కార్మికులందరికీ ధన్యవాదాలు తెలుపారు. ఈ నెల 18 న ఫైనల్ మ్యాచ్ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, అజీం, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# ఫేస్‌బుక్ పరిచయం 2.36 కోట్ల మోసం

జనోదయ హైదరాబాద్ ఏప్రిల్ 05: ఫేస్‌బుక్‌లో మహిళ పేరుతో పరిచయమైన గుర్తుతెలియని వ్యక్తుల మాటలు నమ్మి ఓ వ్యక్తి రూ.2.36 కోట్లు పోగొట్టుకున్నాడు. 'ఫేస్‌బుక్ స్టోర్'లో కొనుగోలు, అమ్మకాలతో లాభాలు వస్తాయన్న బూటకపు మాటలతో మూడున్నర నెలల వ్యవధిలో ఈ డబ్బు బదిలీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్ ప్రాంతంలో నివసించే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వీరభద్రరావుకు గతేడాది ఆగస్టులో ఫేస్‌బుక్‌లో ఒక ఫ్రెండ్ రిక్వెస్ట్ వచ్చింది. కోరా పేరుతో పరిచయం చేసుకున్న మహిళ.. తనది సింగపూర్ అని.. ప్రస్తుతం ముంబయిలో పనిచేస్తున్నట్లు చెప్పేది. ఇద్దరి మధ్య కొన్నిరోజులు చాటింగ్ జరిగాక ఫోన్ నంబర్లు మార్చుకున్నారు. ప్రస్తుతం తన తల్లి.. సవతి తండ్రితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నట్లు కోరా చెప్పేది. తనకు జర్మనీ సహా దేశవిదేశాల్లో స్నేహితులున్నారంటూ ఫేస్‌బుక్ గ్రూపులో వీరభద్రరావును యాడ్ చేసింది. తమ స్నేహితులంతా ఫేస్‌బుక్ స్టోర్‌లో పెట్టుబడులు పెడుతూ భారీగా లాభాలు సంపాదించారని.. డబ్బుంటే ట్రేడింగ్ చేయాలని సలహానిచ్చింది. తొలుత నిరాకరించిన వీరభద్రరావు.. ఆ తర్వాత అంగీకరించడంతో కోరా ఫేస్‌బుక్ స్టోర్ పేరుతో ఒక లింకు పంపింది. అది ఓపెన్ కాకపోవడంతో ఏపీకే ఫైల్‌ను పంపింది. దీన్ని డౌన్‌లోడ్ చేయగానే అచ్చం ఫేస్‌బుక్ తరహా యాప్ వీరభద్రరావు ఫోన్‌లో ప్రత్యక్షమైంది. అందులోని స్టోర్‌లో వస్తువులు కొంటూ విక్రయిస్తూ లాభాలు గడించాలని చెప్పింది. సలహాల కోసం జర్మనీ స్నేహితురాలు బెల్లాతో మాట్లాడాలని ఆమె ఫోన్‌నంబర్ ఇచ్చింది. బెల్లా చెప్పినట్లు చేస్తూ పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. సెప్టెంబరు 1 నుంచి డిసెంబరు 12 మధ్య క్రిప్టో వ్యాలెట్ ద్వారా మొత్తం రూ.2.36 కోట్లు పంపించాడు. ఈ యాప్‌లో లాభాలు వచ్చినట్లు చూపించినా డబ్బు విత్‌డ్రా అవకాశం ఇవ్వలేదు. కొన్ని నెలలపాటు పదేపదే అడిగినా లాభం, అసలు రెండూ ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన వీరభద్రరావు సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు.











# ఏప్రిల్.. ఫూల్ మాసం కాదు.. "మహనీయులకు జన్మనిచ్చిన మాసం"

## -జ్యోతిరావు పూలే జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ కేడల ప్రసాద్

**వరంగల్ జిల్లా ప్రతినిధి: ఏప్రిల్ 05 (జనోదయ):** నవ భారత నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లు "మన చరిత్ర మనం రాసుకునేంతవరకు ఎవరో రాసిన తప్పుడు చరిత్రనే నిజమని నమ్మాల్సి వస్తుంది. ఏప్రిల్ నెలను ఒక పవిత్ర మాసంగా భావించాలి. కారణం ఈ నెలలో ప్రపంచ దేశాలన్నీ అనుసరిస్తున్న మహనీయులలో ఒకరైన ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి 14, అంబేద్కర్ స్వయానా గురువుగా ప్రకటించుకున్న స్త్రీ జనోద్ధారణ కార్యసాధక ఆద్యుడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి కూడా ఈ నెల 11 కావడం మరో ప్రత్యేకం. దేశంలో బహుజనుల పాటు బ్రాహ్మణ స్త్రీలు కూడా అక్షరం వైపు చూడడానికి ప్రధాన కారణం మహాత్మ జ్యోతిబా పూలే మరియు వారి సతీమణి సావిత్రిబాయి పూలే సత్యశోధక సమాజ్ ను స్థాపించి సత్యాన్ని శోధించాలని చెబుతూ.. మూఢనమ్మకాల నిర్మూలనతో పాటు స్త్రీ విద్య, స్త్రీ స్వేచ్ఛ కోసం వారు చేసిన సేవ దేశం యొక్క స్థితిగతులను మార్చాయని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దేశ స్థితిగతులను మార్చగలిగే ఒక వ్యక్తిని అందించిన "మాత రమాబాయి, అంబేద్కర్ లకు వివాహం జరిగినది. ఏప్రిల్ 4. తన బిడ్డలకు కనీస వసతులు కల్పించుకోలేని పరిస్థితిలో ఉండి చనిపోతుంటే ఈ దేశ బిడ్డలే తన కన్న బిడ్డలనీ నమ్మిన దంపతులు ఈ దేశానికి





ఆదర్శ దంపతులు.భారతదేశ ఉప ప్రధానిగా ఎన్నో చట్టాల ద్వారా అన్నగారిన వర్గాల వారి కోసం కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఏప్రిల్ 5, శతాబ్దాల క్రితమే భారతదేశ జీవన మార్గమైనది "గౌతమ బుద్ధుని బౌద్ధ ధర్మం". ఆ ధర్మాన్ని కాపాడడంలో సాటిలేని కృషిచేసిన రారాజు సామ్రాట్ అశోకుడి జయంతి ఏప్రిల్ 7, దేశంలో స్త్రీలకు సమాన హక్కులు ఉండాలని అంబేద్కర్ "హిందూ కోడ్ బిల్లు" సమర్పించిన తేదీ 11, రౌండ్ టేబుల్ సమావేశాల ద్వారా ఓటు హక్కును పొంది, అనుబంధంగా రిజర్వ్ స్థానాల కోసం పోరాటంలో భాగంగా ఎరవాడ జైలులో నాలుగోసారి గాంధీతో చర్చల్లో పాల్గొన్నది ఏప్రిల్ 23, షెడ్యూల్ క్యాస్ట్ ఫెడరేషన్ అభ్యర్థిగా "రాజ్యాధికారమే మాస్టర్ కీ"అని ప్రయోగాత్మకంగా నిరూపించి అంబేద్కర్ పార్లమెంటు కు ఎన్నికైన తేదీ 24.. ఇలా దేశాన్ని చైతన్య పథంలో నడిపించడానికి కీలకమైన ఎన్నో సంఘటనలు జరిగిన, చరిత్ర కలిగిన మాసం ఏప్రిల్... ఏప్రిల్ అందరికీ పవిత్ర మాసమే కానీ ఫూల్ మాసం కాదు.. డాక్టర్ కేడల ప్రసాద్ పటేల్.../ అఖిల భారత మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు.
*పుట్టిన తేదీ ఏప్రిల్ 7...

